# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# బీసీలకు కాంగ్రెస్ ధోకా

తెలంగాణ కాంగ్రెస్ అట్టహాసంగా బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, టీజేఎస్ చీఫ్ కోదండరాంతో పాటు ఇతర రాష్ర్టాల నేతలను తీసుకువచ్చి ఆవిష్కరింపజేసింది. అయితే ఆ డిక్లరేషన్‌ను చూస్తే బీసీల అభివృద్ధి పట్ల కాంగ్రెస్‌కు ఎంత చిత్తశుద్ధి ఉన్నదో ఇట్టే అర్థమైపోతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 34 సీట్లు కేటాయిస్తామని చెప్పి 'హస్తం' పార్టీ బీసీలను మోసం చేసింది. ఇప్పుడు ఎంతో ఆశతో ఎదురుచూసిన బీసీ డిక్లరేషన్ 'కొత్త సీసాలో.. పాత సారా' అన్న సామెతలా కనిపిస్తున్నది. మరోవైపు బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేసిన అంశాలు ఇందులో పొందుపర్చకపోవడాన్ని చూస్తుంటే.. ఆ పార్టీ బీసీలకు ఏ స్థాయిలో గౌరవం ఇస్తున్నదో అర్థమైపోతున్నది.



కుల గణన చేస్తామని, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా ఆరు నెలల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతామని బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ఉమ్మడి రాష్ట్రంలో సుమారు మూడున్నర దశాబ్దాల పాటు, దేశంలో ఆరు దశాబ్దాల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీ కుల గణన గురించి అసలుకే పట్టించుకోలేదు. దీంతో బీసీల జనాభా తెలుసుకోవడానికి 1931లో బ్రిటీష్ వారు చేసిన జన, కులగణనే ఇప్పటికీ ఆధారంగా ఉంటున్నది. మండల్ కమిషన్‌తోపాటు వివిధ రాష్ర్టాల ప్రభుత్వాలు బీసీ కుల గణన చేపట్టాలని సూచించినా, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు. అయితే ఓబీసీ కుల సంఘాల ఒత్తిడి మేరకు 2011లో సామాజిక, ఆర్థిక కులగణనను చేయించినా, ఎవరి ఒత్తిళ్లు పని చేశాయో గానీ.. సాంకేతిక కారణాలను చూపుతూ ఆ నివేదికను మాత్రం బయటపెట్టలేదు. స్థానిక సంస్థల్లో 42 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చినా, అధికారంలో ఉన్నప్పుడు దీని గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుకు, ఏడాదికి రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్‌కు.. పవర్‌లో ఉన్నప్పుడు ఎందుకు గుర్తు రాలేదు? ఎంబీసీ కులాల అభివృద్ధి కోసం ప్రత్యేక ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎందుకు గుర్తించలేకపోయిందన్నది సమాధానం లేని ప్రశ్నే. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో కుల వృత్తులకు అసలు గుర్తింపే లేని పరిస్థితి ఉన్నది. ఇప్పుడు వడ్డీ లేని రుణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పింఛన్లు అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బీసీలు నమ్మే పరిస్థితి లేదు. గొర్రెల పంపిణీ, ఈత చెట్ల పెంపకాన్ని బీఆర్‌ఎస్ ప్రోత్సహించినప్పుడు.. వాటిని విమర్శించింది కాంగ్రెస్ నేతలే. ఇప్పుడు వంద రోజుల్లోనే గొర్రెలు పంపిణీ చేస్తామని, ఈత చెట్ల పెంపకానికి ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమిని కేటాయిస్తామని చెబుతున్నారంటే.. ఆయా వర్గాల ఓటు బ్యాంకే కాంగ్రెస్ లక్ష్యంగా కనిపిస్తున్నది.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ బిల్లును రూపొందించి పార్లమెంటులో ప్రవేశపెట్టాలని బీసీలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుండగా, ఈ విషయాన్ని కాంగ్రెస్ తన బీసీ డిక్లరేషన్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. జనాభా ప్రకారం చట్టసభలతోపాటు విద్యా, ఉద్యోగ రంగాలు, స్థానిక సంస్థలు, కేంద్రస్థాయిలో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని బీసీలు కోరుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం వారికి 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నది. అయితే ఆ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాల్సిన ఆవశ్యకత గురించి కాంగ్రెస్ తన డిక్లరేషన్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. బీసీ బిల్లు కోసం మూడు దశాబ్దాలుగా బీసీలు చేస్తున్న పోరాటాన్ని కాంగ్రెస్ గుర్తించినట్టు కనిపించడం లేదు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో కనీసం ఒక్క బీసీ నేత ఫొటో కూడా కనిపించకపోవడం మరీ దారుణం.

రాష్ట్రంలో సుమారు 72 అసెంబ్లీ స్థానాల్లో 60 శాతం బీసీలున్నారు. అయితే వీటిలోని 40కి పైగా స్థానాల్లో అగ్రవర్ణాలకు చెందిన లీడర్లే దశాబ్దాలుగా రాజ్యమేలుతున్నారు. అయితే ఈసారి బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. టికెట్ల కేటాయింపులో మాత్రం వివక్ష చూపింది. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు సీట్లు బీసీలకు ఇస్తామని ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో ఆ పార్టీ హామీ ఇచ్చింది. ఆ ప్రకారం చూసుకున్నా రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు కనీసం 34 సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ మాట తప్పింది. 119 స్థానాల్లో కేవలం 23 సీట్లను మాత్రమే బీసీలకు కేటాయించింది. బీసీలు ఆర్థికంగా బలంగా ఉన్న స్థానాల్లోనూ అగ్రవర్ణాలకే ప్రాధాన్యం ఇచ్చింది. ముఖ్యంగా ఇతర పార్టీలకు కనీసం డిపాజిట్లు కూడా రాని ఎంఐఎం హవా నడిచే పాతబస్తీలోని ఐదు సీట్లు బీసీలకు ఇవ్వడం గమనార్హం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 8 జనరల్ సీట్లు ఉంటే.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు నాలుగు సీట్లు కేటాయించింది. ఇప్పుడు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ ఒకే ఒక సీటు బీసీకి ఇచ్చారు. సర్వేల్లో ఓడిపోతున్నారని ప్రచారం చేస్తూ బీసీలకు టికెట్లు కేటాయించకపోవడం సరికాదు. టికెట్ దక్కకపోవడంతో బాన్సువాడలో కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజు ఆత్మహత్యకు యత్నించాడు. అయినా కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నేతలు ఆయనను కనీసం పరామర్శించలేదు. బీసీలకు టికెట్లు కేటాయించాలని బీసీ నేతలంతా కలిసి ఢిల్లీకి వెళ్తే హైకమాండ్ కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టినట్టే.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ తొలి పీసీసీ చీఫ్ గా వ్యవహరించిన బీసీ నేత అయిన పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పారు. ఉదయ్ పూర్ డిక్లరేషన్‌ను అమలు చేసే పరిస్థితి కనిపించకపోవటంతో.. తీవ్ర అసంతృప్తితో ఆయన పార్టీని వీడారు. ఇచ్చిన మాట ప్రకారం 34 సీట్లు బీసీలకు ఇవ్వాలని ఆయన చేసిన డిమాండ్‌ను అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో గులాబీ కండువా కప్పుకున్నారు. ఇంకా అనేకమంది జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు సైతం పార్టీని వీడారు. అయినా పార్టీ వీరితో కనీసం చర్చించలేదు. అయితే టికెట్ల కేటాయింపులో ఉదయ్ పూర్ డిక్లరేషన్‌నే అమలు చేయలేని కాంగ్రెస్ నేతలు, బీసీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటే ఎలా నమ్ముతారని బీసీలు ప్రశ్నిస్తున్నారు.



దుండ్ర కుమారస్వామి
99599 12341

(వ్యాసకర్త : జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు)

# గులాబీ జెండానే కావాలి

పల్లెల్లో, పట్టణాల్లో, విశ్వవ్యాప్తంగా గులాబీ జెండాలు గుర్తుంచుకోవాలని రామక్క పిలుపు పరివ్యాపితమై పోతున్నది. భారత రాష్ట్ర సమితి పక్షాన అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలబడ్డ నాయకులు మన ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంతో విజయదుందుభి మోగించేందుకు సంసిద్ధమౌతున్నారు.



శనివారం సాయంత్రం.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ పట్టణం. గులాబీ జెండాలు చూడగానే ఊరంతా ఒక్కచోటికి వచ్చింది. గ్రామ శివారుల్లోనే మహిళలు, యువతులు, యువకులు పెద్దసంఖ్యలో గులాబీ దండులా తరలివచ్చారు. మొట్టమొదటి ర్యాలీలో ఎలా ప్రజలతో మమేకమవ్వాలా అనే జంకుతో ఆరంభమైనా, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గ అభ్యర్థి కడియం శ్రీహరిల పై ప్రజల్లో ఉన్న అభిమానం ఊతంగా ఊరేగింపు ముందుకు సాగింది.

కలిసిన ప్రతీ మహిళ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మన వివరణ అవసరం లేకుండానే కంఠతా చెప్పే స్థాయి చైతన్యాన్ని అంది పుచ్చుకున్నారు. నిజంగానే 'గులాబీల జెండలమ్మ' పాట చొచ్చుకుపోయిన తరహాలోనే అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలు జనం గుండెల్లో చొచ్చుకుపోయాయి. యాంత్రికంగానో, మొక్కుబడిగానో కాకుండా పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా భారత రాష్ట్ర సమితి పక్షాన పనిచేయడానికి సంసిద్ధులవుతున్నారు.

మొదటగా మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కావాలని కోరుకుంటున్న ప్రజానీకం తాము గత పదేండ్లుగా పొందుతున్న సౌకర్యాలను చెప్తుండటం ప్రచారానికి వచ్చే నాయకులను ముగ్ధులను చేస్తున్నది. కనీసావసరాలను ప్రాధాన్యతాక్రమంలో అందిస్తూ రైతు కుటుంబాలకు ఆలంబనగా నిలిచిన ఆచరణాత్మక ప్రభుత్వ విధానం ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నది. మిషన్ భగీరథతో ఇంటింటికి నల్లాల రూపంలో అందిస్తున్న తాగునీటి సదుపాయం దేశంలో ఎక్కడా లభించడం లేదనే వాస్తవ స్థితి అందరి మదిలో పదిలంగా ఉన్నది. ప్రపంచంలో ఎక్కడా లేని రైతు అనుకూల రైతుబంధు తరహా పెట్టుబడి సాయం రైతుకు కంటి నిండా కునుకునిచ్చే ధైర్యాన్నందిస్తున్నది. ఫసలు కొకసారి పెట్టుబడులకోసం పరితపిస్తూ దిగులుపడే రైతు ఇప్పుడు తమకందుతున్న రైతుబంధు ఊతంగా పంటల దిగుబడి పెంచుకోగలిగే కార్యాచరణను రూపొందించుకుంటున్నాడు.

రైతు ధీమాగా ఉన్నప్పుడే కుటుంబం యావత్తు ధైర్యంగా జీవించగలదు. అది సమాజానికి దిశా నిర్దేశం చేయగలదు. అలా బీఆర్‌ఎస్ అందిస్తున్న సంక్షేమాన్ని ప్రచార పర్వంలో ప్రజానీకమే సవివరంగా చెప్తున్నారు. కుటుంబంలో ప్రధాన భూమికను పోషించే మహిళా సంక్షేమం పట్ల బీఆర్‌ఎస్ రూపకల్పన చేసిన, అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో స్పష్టమైన అవగాహన ఉన్నది. ఈసారి కుటుంబాలకోసం రూపొందించిన గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, గ్యాస్ సిలిండర్ల రేటు తగ్గింపు వీటికి తోడు సన్న బియ్యం అందించే కార్యాచరణ ప్రజల్లోకి దూసుకెళ్లింది.

24 గంటల ఉచిత కరెంటు విషయంలో ఆచరణాత్మక ఫలితాలను చూస్తున్న ప్రజలు, ప్రతిపక్షాలు ఇస్తున్న హామీలను విశ్వసించటం లేదు. బీఆర్‌ఎస్ దీర్ఘకాలిక విజన్ పట్ల, ఈ రాష్ట్ర అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమం పట్ల కేసీఆర్ నేతృత్వంలో రూపొందిస్తున్న కార్యాచరణ పట్ల జనంలో అపరిమితమైన విశ్వాసమున్నది. తెలంగాణ ప్రగతి పథ నిర్దేశినిగా బీఆర్‌ఎస్‌ను మాత్రమే ప్రజలు పరిగణిస్తున్నారు. ర్యాలీలు, సభల్లో పాల్గొంటున్న మహిళలు ప్రాక్టికల్‌గా తమకు వివిధ రూపాల్లో అందుతున్న సంక్షేమ ఫలాలను వివరిస్తుండటం గులాబీ జెండాను వాళ్లు తమ జీవిత కాలం మరవరనే వాస్తవాన్ని ధృవపరుస్తున్నది. దళితులు, బీసీల కోసం ఇప్పటికే అమలు పరుస్తున్న పథకాల విస్తరణ రానున్న అయిదేండ్లలో వేలాది, లక్షలాది కుటుంబాల ఉపాధికి ఉపకరిస్తుందని ప్రజల్లో సంపూర్ణ నమ్మకం ఉన్నది.

అవసరాలు, అమలయ్యే తీరు ప్రాతిపదికగా రూపొందించిన గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి తరహా పథకాలు కేవలం బీఆర్‌ఎస్ నాయకత్వంలో మాత్రమే అమలులోకి తెచ్చుకోగలమని ప్రజలు భావిస్తున్నారు.

ప్రచారంలో భాగంగా వీధుల్లో గులాబీ జెండాలెత్తి కారు గుర్తుకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఇంటింటి ప్రచారంలో మ్యానిఫెస్టో వివరిస్తున్నప్పుడు ఇండ్లలో మహిళలు, వృద్ధులు ముందే ఆ అంశాలను ప్రస్తావించడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. నిజంగానే 'గులాబీల జెండలమ్మ' పాట ప్రజల్లో ప్రభుత్వ పథకాలలాగే చొచ్చుకుపోయింది. వాడకట్టులో గుమిగూడిన ప్రజలనుద్దేశించి మాట్లాడడానికి ఉపక్రమించినప్పుడు ఆ పాటకు అనుగుణంగా ప్రజలు వేస్తున్న కోలాటాలు, సంతోష సమాజానికి ప్రతీకలుగా నిలుస్తూ రేపటి ధీమాకు సంకేతాలుగా కొనసాగుతున్నాయి. గులాబీ జెండాలు ఊరూరా రెపరెపలాడుతున్నాయి. కారు గుర్తు అందిస్తున్న సంక్షేమం తమ పదిలమైన భవితకు చిహ్నాలంటున్నాయి. బహుళార్థసాధక ప్రాజెక్టులయినా, సాధారణ జీవనానికి ఉపయుక్తమయ్యే అవసరాలు తీర్చే కార్యాచరణ అయినా బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని దారివెంట ప్రతి ఒక్కరూ వివరిస్తున్నారు. ఇది గ్రౌండ్ లెవల్ రియాలిటీ.



డాక్టర్ కడియం కావ్య
98858 56065

# కేసీఆర్-సక్సెస్ ఫార్ములా!

ప్రణాళికాబద్ధ రాజకీయాలకు పెట్టింది పేరు ముఖ్యమంత్రి కేసీఆర్. తెలంగాణ ఉద్యమాన్ని, ఆటుపోట్లను బాగా ఔపోసన పట్టిన తర్వాతనే.. దాన్ని సాధించేందుకు ఎంచుకున్న మార్గంలో ఓ సక్సెస్ ఫార్ములాను ఆయన అనుసరించారు. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను ఇక్కట్లను ఎలా అధిగమించాలో కూడా ఆయన తన రోడ్‌మ్యాప్‌లో నిర్దేశించుకున్నారు. రాకెట్ ప్రయోగంలో ఎలాంటి ప్రణాళిక ఉంటుందో తెలంగాణ సాధనలోనూ.. తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటులోనూ..పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన ప్రణాళిక దాగి ఉన్నది. అందుకే ఆయన రాజకీయ జీవితం అప్రతిహతంగా కొనసాగుతున్నది.



గుడ్డెద్దు జొన్నచేలో పడ్డట్టుగా కేసీఆర్ రాజకీయాలు చేయరని ఆయన సక్సెస్‌ను గమనించినవారు చెప్తారు. గత ఎన్నికల్లో విజయం సాధించడంలోనూ.. ఎన్నికలను ముందుకు జరిపి ముందస్తుకు వెళ్లడంలోనూ అనూహ్యమైన ప్రణాళిక ఉన్నది. ప్రజలనాడి పట్టకుండా రాజకీయాలు చేసేవారు ఫెయిలవుతారు. ఇది బాగా ఎరిగిన వారు సక్సెస్ అవుతారు. అందుకే రాజకీయాల్లో కేసీఆర్ సాధించిన విజయాలు మరే పార్టీ లేదా నేత సాధించలేకపోతున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని తలకెత్తుకునే ముందు కేసీఆర్ ఎంతగానో మేధోమథనం చేశారు. తను ఎంచుకున్న మార్గంలో ముళ్లు, రాళ్లు, ఎగుడుదిగుడులు ఉంటాయని తెలిసినా, వాటిని ఎలా తొలగించుకుంటూ ముందుకు సాగాలో కూడా ప్రణాళిక మేరకు ముందుకు సాగారు. ఆయనను దగ్గరగా చూసిన వారికి ఆయన రచిస్తున్న వ్యూహాలు తెలుసు. నెలల తరబడి నిద్రాహారాలు కూడా మానేసి ఆయన ఓ రోడ్‌మ్యాప్ గీసుకుని ముందుకు నడిచారు. ఆషామాషీగా ఆయన రంగంలోకి దిగలేదు... దిగిన తర్వాత వెనుదిరిగి చూడలేదు. అదే ఆయన విజయ రహస్యం.

తెలంగాణ ఉద్యమం సాధించిన విజయంతో ప్రభుత్వాన్ని కూడా తను ఏర్పాటు చేస్తేనే సాధించుకున్న తెలంగాణ ఆకాంక్షలు సాకారమవుతాయని భావించారు. ఎంతోమంది విద్యార్థి నాయకులకు, ఉద్యమకారులకు ఎంపీ, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కింది. ఉద్యమకారులను పట్టించుకోవడం లేదనే విమర్శలదేముంది చాలా చేస్తారు. కానీ, ప్రజలకు తెలుసు. అందుకే ఆయన వెంట ప్రజలు కూడా నమ్మకంగా నడిచారు. ప్రజల నాడిని పట్టి. .వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగడం.. రాజకీయాలో ఎత్తులు, పై ఎత్తులు వేయడం కేసీఆర్‌కు మాత్రమే తెలిసిన విద్య.

జాతీయ పార్టీలో ఆయన ఉండి ఉంటే ఈ పాటికి వేరుగా ఉండేది. కేసీఆర్‌కు దేశం మీద అవగాహన ఉన్నది. నదుల మీదా.. వాటి నడక మీదా అవగాహన ఉన్నది. అన్నింటికి మించి ప్రజల జీవనవిధానంపై లోతైన అవగాహన ఉన్నది. ప్రపంచ గమనం పైనా అవగాహన ఉన్నది. ప్రపంచ రాజకీయాలతో పాటు, దేశ రాజకీయాలను బాగా ఔపోసన పట్టిన వ్యక్తి. దేశంలో మోదీతో పోల్చుకుంటే కేసీఆర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయగల సత్తా ఉన్న నేత. దేశంలో ఉన్న వనరులు, వాటిని ఉపయోగించుకునే తీరు కూడా బాగా తెలిసినవాడు. తెలంగాణలో 24 గంటల నిరంతర విద్యుత్తును ఇవ్వగలగటంలోనే ఆయన దార్శనికతను అర్థం చేసుకోవచ్చు. నిరంతర విద్యుత్తు ఉంటే చిన్నా, పెద్దా పరిశ్రమల ఉత్పత్తి రంగం దెబ్బతినదని కూడా బాగా తెలుసు. అందుకే నిరంతర విద్యుత్తును సాకారం చేశారు. నిజానికి దేశవ్యాప్తంగా నిరంతర విద్యుత్తు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో ఇప్పుడు ఆలోచన చేయాలి. దేశంలో పారుతున్న నదులను కూడా ఎలా ఉపయోగించుకోవాలో బాగా తెలిసిన వ్యక్తి కేసీఆర్. అందుకు గోదావరి జలాలను ఎదురెక్కించి రిజర్వాయర్లను కట్టించిన తీరు ఆయన ముందుచూపుకు నిదర్శనం. కాళేశ్వరంతో మొదలు పెట్టి.. కొండపోచమ్మసాగర్ వరకు నీటి రాకను చూస్తే అద్భుతం అని అనని వారుండరు. ఒక రాష్ర్టాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చన్నది కేవలం ఈ తొమ్మిదేండ్లలో చేసి చూపారు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టడం, చెరువులను పునరుద్ధరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోయడం, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయడం చేశారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచి మొక్కల పెంపకం ప్రాధాన్యం తెలిపారు. జిల్లాల విభజనతో పాలనను ప్రజలకు చేరువ చేశారు. అన్నింటికి మించి యాదాద్రి ఆలయాన్ని నభూతో నభవిష్యతి అన్న రీతిలో పునరుద్ధరించి.. కాకతీయ కళావైభవాన్ని కండ్లకు కట్టారు. ఇవన్నీకూడా విప్లవాత్మక నిర్ణయాలే.

ఇదే తరహాలో దేశ పగ్గాలు అందుకుంటే ఖచ్చితంగా ఓ నాలుగైదేండ్లలో గణనీయమైన మార్పులు చూపి.. ప్రజలకు ఆదర్శనేతగా నిలిచే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉందనడంలో సందేహం లేదు. నిజానికి కేసీఆర్ ఏదేనీ జాతీయ పార్టీలో ఉండి ఉంటే మోదీకి అవకాశం వచ్చేది కాదు. మోదీకి లేని విజన్ కేసీఆర్‌కు ఉందనడంలోనూ సందేహం లేదు. మోదీది ప్రచార పటాటోపం తప్ప మరోటి కాదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నేటికీ మోదీ పెద్దగా విజయం సాధించలేదు. ప్రజల నాడిని పట్టిన నేతగానే కేసీఆర్ దేశం ముందు నిలిచారు.

తెలంగాణ ఉద్యమంలో ఎవరెవరిని ఎలా వాడుకోవాలో అన్న ప్రణాళికతోనే కార్యక్షేత్రంలోకి దిగారు. అసాధ్యం అన్న తెలంగాణను సుసాధ్యం చేసి చూపారు. జాతీయస్థాయిలో ఏయే రాజకీయ పార్టీలతో స్నేహం చేయాలో చేశారు. ఎవరెవరిని మచ్చిక చేసుకోవాలో చేసుకున్నారు. ఇలా తెలంగాణను సాకారం చేయడంతో పాటు, పాలనలో తనదైన ముద్ర వేయగలిగారు. రాజకీయ పార్టీల హడావుడి, విమర్శలు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇంతకుమించి చేయగలిగిన నేత ఇతర పార్టీల్లో లేరు. అంతెందుకు తెలంగాణలో కేసీఆర్‌ను మించిన విజనరీ నేత లేడనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే నూరు కాదు.. నూటా ఐదు సీట్లు గెలుస్తామన్న ధీమాలో కేసీఆర్ ఉన్నారు. ఈ ధీమా వెనక కూడా బృహత్తర ప్రణాళిక దాగి ఉంటుంది. అదే సాకారం అవుతుందని మరోమారు మనం గమనించక తప్పదు.



రాంపల్లి మహాలక్ష్మి
70139 01466



దశాబ్దాల పరాయి పాలన నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నది తెలంగాణ. వీరుల పోరాటంతో త్యాగాల ఫలాలు అందుకుంటున్నది. కానీ.. తెలంగాణకు ప్రమాదం ఇంకా పొంచే ఉన్నది. కుట్రదారులు మారువేషాల్లో తిరుగుతున్నారు. ఇది ముమ్మాటికీ నిజం. ప్రజానీకం అప్రమత్తంగా లేకపోతే... ఇక్కడి కీలు బొమ్మల తోనే పరాయి పాలకులు మళ్లీ మన బతుకుల్ని ఆగం చేయడం ఖాయం. ఇందుకు అనేక ఉదాహరణలు మన కండ్ల ముందు కనిపిస్తున్నాయి. దొంగలంతా పట్టపగలే కత్తులు భుజాలపై వేసుకుని తిరుగుతున్నారు. ఆదమరచి ఉంటే... మళ్లీ మనం అన్యాయమైపోతాం. అస్తిత్వం కోల్పోతాం. తెలంగాణ రాష్ట్రం విఫల ప్రయోగమని హేళనకు గురవుతాం.

# నువ్వింకా టీడీపీ బానిసవే

తెలంగాణలో కనుమరుగైన టీడీపీ... కాంగ్రెస్ పార్టీతో చీకటి ఒప్పందం చేసుకున్నది. ఒప్పందంలో భాగంగా చంద్రబాబు.. తన బానిస రేవంత్ రెడ్డికి పీసీసీ పగ్గాలు ఇప్పించాడు. ఇది జగమెరిగిన సత్యం. కాంగ్రెస్‌లో చాలామంది చెప్పేమాట కూడా ఇదే. తెలంగాణ ఆత్మగౌరవాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రాజకీయం చేస్తున్నాడు. సందర్భం వచ్చిన ప్రతిసారి... నిస్సిగ్గుగా చంద్రబాబుపై ప్రేమను వ్యక్తం చేస్తున్నాడు. చంద్రబాబు ఎజెండానే అమలు చేస్తున్నాడు. ఇప్పుడు మరోసారి రేవంత్ అసలు రంగు బయటపడింది. బయటపడింది అనడం కూడా కరెక్టు కాదేమో... ఎందుకంటే.. అది బహిరంగ రహస్యమే. తెలంగాణలో టీడీపీని దెబ్బ తీసినందుకు తెగ బాధ పడిపోతూ.... తాజాగా చంద్రబాబుపై అభిమానం చాటుకున్నాడు. తాను చంద్రబాబుకు బానిసే అని నిరూపించుకున్నాడు.

పాలకుర్తి ప్రచారసభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి 'తెలంగాణలో టీడీపీని దెబ్బ తీసింది ఎర్రబెల్లి దయాకర్‌రావు' అని అన్నాడు. అందుకే తెలుగుదేశం అభిమానులు ఎర్రబెల్లిని ఓడించాలని పిలుపునిచ్చాడు. అసలు.. రేవంత్, నువ్వు కాంగ్రెస్ లీడర్‌వా? టీడీపీ లీడర్‌వా? ఏం బానిస బతుకు నీది అని... జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో తెలంగాణ వాదులంతా రేవంత్ బానిసత్వాన్ని ఎండగడుతున్నారు.


చంద్రబాబుపై ప్రేమను చాటుకోవడం ఏంటని నిలదీస్తున్నారు. ప్రాంతీయేతరుడు మోసం చేస్తే ఎలా గుణపాఠం చెప్పాలో కాళోజీ మనకు బోధించారు. అదే చేశాం. మరి ప్రాంతం వాడు మోసం చేస్తే ఏం చేయాలో కూడా చెప్పారు. కాబట్టి... బిడ్డా రేవంత్ తస్మాత్ జాగ్రత్త అంటూ జనం హెచ్చరిస్తున్నారు.

తెలంగాణలో రైతుల రక్తం ఏరులై పారించిన చరిత్ర చంద్రబాబుది. ప్రశ్నించిన గొంతుల్ని మాయం చేసిన నరరూప రాక్షసుడు చంద్రబాబు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడుగడుగునా అడ్డుకున్న కుట్రదారు చంద్రబాబు. రాష్ట్ర ఏర్పాటు జరిగే ఆఖరి నిమిషంలోనూ చంద్రబాబు కుట్రలు కొనసాగించాడు. అటువంటి తెలుగుదేశం పార్టీని తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రజలు కరకట్టకు తరిమికొట్టారు. కానీ, ఆ పార్టీ బానిసలు కొందరు ఇంకా తెలంగాణలో వివిధ ముసుగుల్లో తిరుగుతున్నారు. టీడీపీ పేరుతో రాజకీయం చేస్తే, మొహంపై జనం ఉమ్ముతారు కాబట్టి, కండువాలు మార్చి మారువేషంలో నాటకాలు ఆడుతున్నారు. ఇందులో నెంబర్ వన్ తెలంగాణ ద్రోహి... రేవంత్ రెడ్డి. తెలంగాణ సమాజం జాగరూకతతో వ్యవహరించి... దొంగల భరతం పట్టాలి.



ఇనుగుర్తి సత్యనారాయణ
9704617343

## సముద్రం-గుడిసె



సముద్రం వాకిట్లోకి వచ్చి నిలబడింది
మరి, గుక్కెడు మంచినీళ్ల కోసం
గుడిసె ముందు బేలగా నిలబడింది.. ఎందుకో?
చిన్న గాలివాటుకే ఎగిరిపోయే తాటాకుల గుడిసె

సంద్రం ముందు దాని రుబాబు ఎంత?
ఐనా, ఈ క్షణం గుడిసె ఛాతీ విరుచుకొని ఉంది
ఉప్పు సముద్రాలనే కళ్లలో నింపుకొని ఉన్న గుడిసె
నదులను మింగినా తీరని దాహం సముద్రానిది

సముద్రాలను కళ్లలో ఒంపుకున్నా
ఒడువని దుఃఖం గుడిసెది
వెయ్యి నాలుకలతో తీరాన్ని తాకినా
సముద్రానిది తీరని దాహం
గుడిసె లోపలి మట్టి కుండలోని
నీటితో తీరాలి దాని దాహం



డాక్టర్
రూప్‌కుమార్ డబ్బీకార్
91778 57389